భానుడి భగభగ

- గణనీయంగా పెరుగుతున్న ఉష్ణోగ్రత్తలు
- ఉష్ణతాపంతో అల్లాడిపోతున్న జనం





ఎండ తీవ్రతకు ఖాళీగా ఉన్న ఎమ్మిగనూరు - కర్నూలు ప్రధాన రహదారి

గోనెగండ్ల: ఎండ వేడిమితో జనాలు అల్లాడిపోతున్నారు. వేసవి ప్రారంభంలోనే ఎండలు అల్లాడిస్తున్నాయి. రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో జనం బెంబేలెత్తిపోతున్నారు. ఉక్కపోత నుంచి ఉపశమనానికి ప్రజలు ఏసీలు, కూలర్లను ఆశ్రస్తున్నారు. పగలు, రాత్రి ఉష్ణోగ్రత్తల్లో వ్యత్యాసం ఎక్కువగా ఉంటోంది. పగటి పూట 40 నుంచి 43 డిగ్రీలు నమోదవుతున్నాయి.

పెరిగిన విద్యుత్ వినియోగం

పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు, ఫ్రీజ్‌ల వాడకం పెరిగింది. వారం రోజులుగా విద్యుత్ వాడకం పెరిగినట్లు విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు. ఏసీలు, కూలర్లు, ఫ్యాన్ల విక్రయాలు కూడా పెరిగాయి. ఆర్థిక స్తోమత కలిగిన వారు ఏసీలను ఆశ్రయిస్తుంటే మధ్య తరగతి, సామాన్యులు కూలర్లు, ఫ్యాన్లతో సరిపెటుకుంటున్నారు. గత వారం రోజులతో పోల్చితే విక్రయాలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం వివిధ రకాల కంపెనీలు ఈఎంఐ సదుపాయం కల్పిస్తుండటంతో ఏసీలు, కూలర్ల కొనుగోళ్లు గతంలో కంటే పెరిగినట్లు వ్యాపారులు పేర్కొంటున్నారు.

జాగ్రత్తలు తీసుకోండి



రోజురోజుకు ఉష్ణోగ్రతలు అధికమవుతున్నాయి. వడదెబ్బ బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి. ఏవైనా పనులు ఉంటే తప్ప ఎండలో తిరగకూడదు. అత్యవసరమైతే ఉదయం పూటనే చేసుకోవాలి. ఎండలో బయటకు వెళ్లాల్సి వస్తే కచ్చితంగా గొడుగు, టోపీ ధరించాలి. రోజుకు కనీసం 15 గ్లాసుల నీళ్ల తాగాలి. నీరు, పండ్ల రసాలు, కొబ్బరి నీళ్ల, మజ్జిగ వంటి ద్రవ పదార్థాలు తీసుకోవాలి.

– డాక్టర్ రంగ రవళి, గోనెగండ్ల

సంక్షేమ ప్రభుత్వానికి అండగా నిలవండి



వెల్దుర్తిలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

- ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

వెల్దుర్తి(కృష్ణగిరి): పార్టీలు, కుల, మతాలకతీతంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ, అందరి మంచి కోరే సీఎం జగనన్నను రానున్న ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అండగా నిలవాలని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శనివారం ఆమె వెల్దుర్తి పట్టణ కేంద్రంలో తనయుడు కంగాటి రామ్మోహన్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మన రవిరెడ్డి, జెడ్పీటీసీ సుంకన్న, సర్పంచ్ ముత్యాల శైలజలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు పంచుతూ ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ సాగారు. అమలు చేసిన సంక్షేమ పథకాలు వివరిస్తూ, చేసిన అభివృద్ధి తెలియజేశారు. ప్రతి ఇంట మహిళలు, గ్రామస్తులు ఎమ్మెల్యేను పూలమాలలు, హారతులతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో సంక్షేమ ఫలాలు ఇంటి వద్దకే అందుతున్నాయన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే గతంలో మాదిరి జన్మభూమి కమిటీల పెత్తనంతో అర్హులకు మొండి చేయి తప్పదన్నారు. టీడీపీకి ఓటు వేస్తే మళ్లీ చీకటి రోజులు తప్పవన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చేలా పత్తికొండ ఎమ్మెల్యేగా తనను, కర్నూలు ఎంపీగా బీవై రామయ్యను గెలిపించేలా రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు ఓయాలని కోరారు. ప్రచారంలో నాయకులు బొమ్మన పెద్దిరెడ్డి, అగస్టీన్, వెంకట్‌నాయుడు, దేవమ్మ, చిట్టెమ్మ, దేవరాజు, పెద్దన్న, ఆరిఫ్, రాజు, శివారెడ్డి, బాలాజీ, భాస్కర్, శ్రీను, సలాం, సిద్ధ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు






కైరుప్పలలో వెలసిన వీరభద్ర స్వామి, కాళికాదేవి

ఆస్పరి: మండలంలోని కైరుప్పల గ్రామంలో వీరభద్రస్వామి, కాళికాదేవి బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ నిర్వాహకులు రాంప్రసాద్, గ్రామ పెద్దలు శనివారం తెలిపారు. 7 ధ్వజారోహణము సందర్భంగా స్వామీ, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, 8న పూజా కార్యక్రమం, 9న ఉగాది, 10న పెద్ద నుగ్గులాట, 11న స్వామి వారికి ప్రత్యేక పూజలు, 12న సాధారణ పూజలు, 13న రథోత్సవం,14న ప్రత్యేక పూజలు, 15న వసంతోత్సవం ఉంటుందన్నారు.

భక్తిశ్రద్ధలతో బడీరాత్



విద్యుద్దీపాల వెలుగులో జామియా మసీదు

ఆలూరు రూరల్: లైలతుల్ ఖదర్ (బడీరాత్)ను ముస్లింలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇషా, తరాహ్‌వీ నమాజ్ అనంతరం రాత్రంగా అల్లాహ్ ఆరాధనలో గడిపారు. పెద్దలు, పిల్లలు ప్రత్యేక నమాజ్ చేశారు. పవిత్ర రంజాన్ మాసంలో లైలతుల్ ఖదర్‌కు ప్రత్యేక స్థానం ఉంది. వెయ్యి నెలలకు పైగా అల్లాహ్ స్మరణం, దువా, ప్రత్యేక ప్రార్థనల చేసిన పుణ్యఫలం లభించే రాత్రిని బడీరాత్ అంటారని మత పెద్దలు తెలిపారు. బడీరాత్ పురస్కరించుకుని ఆలూరులోని జామియా మసీదును విదుద్దీపాలతో అలంకరించారు.

టీబీ డ్యామ్‌లో తగ్గుతున్న నీటి నిల్వలు



హొళగుంద: కర్ణాటకలోని హొస్పేట్ వద్ద ఉన్న తుంగభద్ర జలాశయం(టీబీ డ్యాం)లో రోజు రోజుకు నీటి మట్టం తగ్గుముఖం పడుతున్నాయి. 105.788 టీఎంసీల నిల్వ సామర్థ్యానికి గానూ శనివారం నాటికి 4.292 టీఎంసీలకు చేరింది. గతేడాది ఇదే సమయానికి 5 టీఎంసీలు ఉండేవి. వర్షాభావ పరిస్థితుల కారణంగా ఈ ఏడాది ఖరీఫ్‌లో ఒక పంటకు మాత్రమే సాగునీరు ఇచ్చిన టీబీ బోర్డు అధికారులు.. ఎల్లెల్సీకి గతేడాది డిసెంబర్‌లో నీటి సరఫరాను నిలిపేశారు. తిరిగి తాగునీటి అవసరాలకు గానూ ఫిబ్రవరి 19న విడుదల వేశారు. 50 రోజుల పాటు కొనసాగించి ఈనెల 11న నీటి సరఫరాను నిలిపేయనున్నారు.

గోడౌన్లను సద్వినియోగం చేసుకోండి

చిప్పగిరి: మండలంలో ప్రభుత్వం నిర్మించిన మల్టీపర్పస్ గోడౌన్లను సద్వినియోగం చేసుకోవాలని బెల్డోణ సొసైటీ సెక్రటరీ హరికృష్ణ రైతులకు సూచించారు. శనివారం సొసైటీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు.

ఖర్జూరాల పంపిణీ

మద్దికెర: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని 40 రోజుల పాటు ఉపవాసదీక్షలు చేస్తున్న ముస్లింలకు మండల పరిధిలోని పెరవలి గ్రామానికి చెందిన పారా సేవాసమితి సభ్యులు పారా రామచంద్రప్రసాద్, పారా విశ్వనాథ్ శనివారం ఖర్జురాలు పంపిణీ చేశారు.

ఓటర్లకు ఇబ్బంది లేకుండా చూడాలి

మద్దికెర: సాధారణ ఎన్నికల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని బీఎల్‌ఓలు, రెవెన్యూ అధికారులకు తహసీల్దార్ రజాక్‌వలి సూచించారు. శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 85 ఏళ్ల పైబడిన వృద్ధులు ఇంటి వద్దే ఓటు వేసేందుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించిందని, వారి అలాంటి వారి వివరాలు సేకరించాలని సూచించారు.

ఉపాధి కూలీ పెంపు

మద్దికెర: ఉపాధి కూలీలకు రోజు వారి వేతనం రూ.272 నుంచి రూ.300లకు పెంచినట్లు ఏపీఓ నర్సిరెడ్డి శనివారం తెలిపారు. కూలీలు పనులకు హాజరై సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సమస్యలు పరిష్కరించండి

ఆలూరు రూరల్: ఏపీ మోడల్ గర్ల్స్ హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కరోనా కాలం నాటి పెండింగ్‌లో ఉన్న 8 నెలల వేతనాలు మంజూరు అయ్యేలా చొరవ చూపాలని ఏపీ మోడల్ హాస్టల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు సుధారాణి కోరారు. శనివారం సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ విజయ జ్యోతిని కలిసి విన్నవించారు. హాస్టళ్లలో నైట్ వాచ్‌మెన్, ఏఎన్‌ఎంలను నియమించాలని విన్నవించారు.

ఓటు హక్కును వినియోగించుకోండి



ఆలూరులో ఓటు చైతన్య ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

- ఆలూరు అసెంబ్లీ ఎన్నికల అధికారి రాము నాయక్

ఆలూరు రూరల్: ప్రజాస్వామ్య పరిరక్షణకు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఆలూరు నియోజకవర్గ ఎన్నికల అధికారి రాము నాయక్ సూచించారు. శనివారం ఆలూరులో సెక్టోరల్ అధికారులు, బీఎల్‌ఓలు, అన్ని శాఖల అధికారులతో కలిసి ఓటరు చైతన్య ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంత వాతావరణం కల్పిస్తామని, ప్రలోభాలకు గురి కాకుండా విలువైన ఓటును ఇష్టమైన అభ్యర్థికి వేసుకోవాలని సూచించారు.

పోస్టల్ బ్యాలెట్లపై సిబ్బందికి అవగాహన

హోం ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్ల వినియోగంపై సెక్టోరల్, బీఎల్‌ఓలకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాము నాయక్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. స్థానిక ఆర్డీటీ ఆడిటోరియంలో 28 సెక్టోరల్ ఆఫీసర్లు, 294 పోలింగ్ బూత్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. 85 ఏళ్ల పైబడిన వృద్ధులు, వికలాంగుల ఇంటికి వెళ్లి ఫారం–12డీ అందించి వారి నుంచి ధ్రువీకరణ పత్రం తీసుకోవాలని ఎన్నికల అధికారి సూచించారు. ఈనెల 8వ తేదీలోపు ఈ ప్రక్రియ పూర్తి కావాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి చంద్రశేఖర్, తహసీల్దార్లు ఈశ్వరయ్య శెట్టి, పద్మజ, ఈరమ్మ సీఐ వెంకటేశ్వర్లు డిప్యూటీ తహసీల్దార్ రజనీకాంత్ రెడ్డి, ఈడీటీ గుండాల్ నాయక్ పాల్గొన్నారు.

భవిష్యత్‌ను నిర్ణయించేది ఓటు



ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్‌ఓ, కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: ఓటరు భవిష్యత్‌ను నిర్ణయించేది ఓటు అని రిటర్నింగ్ అధికారి చిరంజీవి, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద నీ ఓటు నీ భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పౌరుడు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేషారెడ్డి, సీఎంఎం జయవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు 14తో గడువు పూర్తి

తుగ్గలి: ఈ నెల 1వ తేదీకి 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకోవడానికి 14వ తేదీతో గడువు పూర్తి కానుందని తహసీల్దార్ షర్మిల తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ అర్హత ఉన్న వారంతా ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఇప్పటి వరకు మండలంలో 24,496 మంది పురుషులు, 24,062 మహిళలు, ఇతరులు ఆరు గురితో కలిపి మొత్తం 48,464 మంది ఓటర్లు ఉన్నారన్నారు. అనంతరం తహసీల్దార్ వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. హోం ఓటింగ్ ఏర్పాట్లపై చర్చించారు. 85 ఏళ్ల పైబడిన వృద్ధులు, దివ్యాంగ ఓటర్ల సమాచారం సిద్ధం చేసుకోవాలని సూచించారు.

10 నుంచి పెద్దమ్మ ఆలయ ప్రతిష్ఠోత్సవాలు

తుగ్గలి: మండల పరిధిలోని నల్లగుండ్లలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మ అవ్వ ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం ఈనెల10 నుంచి నిర్వహించనున్నట్లు శనివారం గ్రామస్తులు తెలిపారు. 10, 11న ప్రత్యేక పూజలు, హోమాలు, 12న పెద్దమ్మ అవ్వ దేవత విగ్రహ, శిఖర ప్రతిష్ఠ ఉంటాయని వివరించారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా

కృష్ణగిరి: మండలంలోని ఎరుకలచెరువు, టి.గోకులపాడు, చిట్యాల, తొగర్చేడు, చుంచుఎర్రగుడి, కంబాలపాడు, కటారుకొండ, ఎరుకల చెర్వు గ్రామాలను సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించామని ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల దృష్ట్యా ఆయా గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. మండల వ్యాప్తగా ఇప్పటి వరకు 350 మందిపై 50 కేసులు నమోదు చేసి రూ.లక్ష పూచీకత్తుతో తహసీల్దార్ ముందు బైండోవర్ చేశామన్నారు.

తల్లి విజయానికి తనయుడి ప్రచారం



గురజాలలో ప్రచారం చేస్తున్న బుట్టా ప్రతుల్

నందవరం: వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తన తల్లి బుట్టా రేణుకను ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆమె తనయుడు బుట్టా ప్రతుల్ కోరారు. శనివారం గురజాల గ్రామంలో ఆయన ఎన్నికల ప్రచారం చేపట్టారు. ముందుగా రామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తన తల్లి బుట్టా రేణకను గెలిపించాలని కోరారు. అలాగే ఎంపీ అభ్యర్థిగా బీవై రామయ్యను గెలిపించాలన్నారు. ప్రచారంలో పార్టీ మండల కన్వీనర్ శివారెడ్డిగౌడ్, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు విరుపాక్షిరెడ్డి, నాయకులు రామకోటేశ్వర్‌రెడ్డి, నరహరి రెడ్డి, రాఘవరెడ్డి, రామచంద్రారెడ్డి, సర్పంచు వీరస్వామి, నరసింహారెడ్డి, రామచంద్ర, లింగన్న, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

98 శాతంపైగా పింఛన్ల పంపిణీ



తుగ్గలిలో వృద్ధురాలు రాములమ్మ వద్దకే వెళ్ల పింఛన్ అందజేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ పులిశేఖర్

తుగ్గలి: పండుటాకులను ఇబ్బంది పెట్టేలా టీడీపీ ఎన్ని కుట్రలు పన్నినా.. వాటిని ప్రభుత్వం ధీటుగా ఎదుర్కొంది. వలంటీర్లను ఇళ్లకు వెళ్లి పింఛన్ ఇవ్వకుండా కుతంత్రాలు పన్నిన టీడీపీకి చెంపపెట్టుగా సచివాలయ వ్యవస్థ ద్వారా పెన్షన్‌దారులకు పింఛన్ సొమ్ము అందేలా చర్యలు తీసుకుంది. సచివాలయ ఉద్యోగులు నడవలేని పెన్షనర్ల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్ సొమ్ము అందించారు. దీంతో నియోజకవర్గంలో నాలుగోరోజు శనివారం సాయంత్రానికి 98 శాతానికిపైగా పింఛన్లు పంపిణీ చేశారు. వెల్దుర్తిలో 8,062కు గాను 7,981(99శాతం), కృష్ణగిరిలో 4,909 గాను 4,855 (98.9శాతం), తుగ్గలిలో 7,804కు గాను 7,678 (98.39శాతం), మద్దికెరలో 4,868 గాను 4,789(98.38), పత్తికొండలో 8,737గాను 8,612(98.57శాతం) మందికి పింఛన్లు అందజేశారు.

గోనెగండ్ల మండలంలో 96 శాతం పూర్తి

గోనెగండ్ల: రెండు రోజులుగా జరుగుతున్న పింఛన్ల పంపిణీలో భాగంగా మండలంలో 96 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయినట్లు శనివారం ఎంపీడీఓ సోనిబాయి తెలిపారు.

రైతుపై మహిళా కూలీల దాడి



రైతుతో మాట్లాడుతున్న మహిళా కూలీలు

ఆదోని అర్బన్: ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో డబ్బు ఇవ్వనందుకు వేరుశనగకాయల రైతుపై ఐదుగురు మహిళా కూలీలు ఇనుప చాటతో దాడి చేసిన సంఘటన శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. రైతు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పత్తికొండ మండలం దూదేకొండ గ్రామానికి చెందిన మాల నాగార్జున శనివారం 20 సంచుల వేరుశనగకాయలను ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డుకు అమ్మకానికి తీసుకొచ్చాడు. యార్డులోని ఓ ఏజెంట్ వద్ద 20 సంచులు అమ్మకానికి టెండర్ పెట్టారు. మధ్యాహ్నం టెండర్ ప్రకటన తర్వాత రైతు వేరుశనగకాయల దిగుబడి క్వింటా రూ.5990 చొప్పున ఓ వ్యాపారికి నమోదయ్యింది. దీంతో ఆ రైతు వేరుశనగకాయలను మహిళా కూలీలతో శుభ్ర చేయించేందుకు వచ్చాడు. మహిళా కూలీలు వేరుశనగకాయలను మధ్యలోనే శుభ్రపరచడం ఆపుతామని, తమకు రూ.500 ఇవ్వాలని రైతును డిమాండ్ చేశారు. అయితే డబ్బు ఎందుకు ఇవ్వాలి, శుభ్రం చేయండి, ఇప్పటికే ఆలస్యమయ్యిందని రైతు చెప్పినందుకు ఆగ్రహించిన మహిళా కూలీలు ఇనుప చాటతో దాడి చేశారు. దీంతో వెంటనే యార్డు కార్యాలయంలో అధికారులకు రైతు ఫిర్యాదు చేశాడు. విషయంపై అసిస్టెంట్ సెక్రటరీ శాంతకుమార్ దృష్టికి తీసుకెళ్లగా రైతుపై మహిళలు దాడి చేసిన విషయం తెలిసిందని, అయితే తమకు ఫిర్యాదు చేయలేదని, రైతు, మహిళలు, వ్యాపారులు, ఏజెంట్ మాట్లాడుకొని రాజీ అయ్యారని తెలిపారు.

విద్యుదాఘాతంతో ఆస్తి నష్టం



కాలిన నగదు

నందవరం: మండలంలోని కొత్త కైరవాడిలో గ్రామంలో శుక్రవారం రాత్రి కాశీ, ఈరమ్మ దంపతులు ఇద్దరు పిల్లలతో కలిసి కొట్టంలో నిద్రిస్తుండగా విద్యుదాఘాతంతో మంటలు వ్యాపించాయి. భార్య, భర్త అప్రమత్తమై ఇద్దరు పిల్లలను తీసుకుని బయటకు పరుగులు తీయడంతో ప్రమాదం తప్పింది. కాగా కొట్టంతో పాటు బీరువా, ఫ్రిజ్, రూ.25 వేల నగదు, ధాన్యం ఇతర సామగ్రి పూర్తిగా కాలిపోయి దాదాపు రూ.లక్ష నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక కుమారుడు ప్రతుల్ గ్రామానికి చేరుకుని కొట్టాన్ని పరిశీలించారు. బాధితుడిని ఓదార్చి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

సంక్షిప్తం

ఓటరు నమోదుకు చివరి అవకాశం

కృష్ణగిరి: పద్దెనిమిదేళ్లు నిండిన యువతీయువకులకు ఓటరుగా నమోదు చేసుకునేందుకు చివరి అవకాశం కల్పిస్తున్నట్లు తహసీల్దార్ అనురాధ తెలిపారు. శనివారం తహసీల్దార్ మాట్లాడుతూ మండల పరిధిలోని 40 పోలింగ్ కేంద్రాల్లో ఈ నెల 14 వరకు ప్రత్యేక ఓటర్ నమోదును చేపడుతున్నామని, అర్హులైన యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చదువుతో చైతన్యం

వెల్దుర్తి(కృష్ణగిరి): బాలికలు చదువుతోనే చైతన్యం సాధించగలుగుతారని, బంగారు భవిష్యత్తుకు బాటవుతుందని ఐసీడీఎస్ వెల్దుర్తి ప్రాజెక్ట్ సీడీపీఓ ల్యూక్ అన్నారు. శనివారం ఆయన స్థానిక కేజీబీవీలో బేటి బచావో, బేటి పడావో కార్యక్రమంలో భాగంగా బాలికలకు ఐఈసీ మెటీరియల్ ద్వారా వివిధ విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఓ షాకీరాబేగం, సెక్టార్ సూపర్‌వైజర్లు సునీత, సరస్వతమ్మ, శ్రీదేవి, కోఆర్డినేటర్ సుజాత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దరఖాస్తులు ఆహ్వానం

మద్దికెర: స్థానిక ఆదర్శ పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సవిత శనివారం తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో చేరేందుకు మే 22వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఇళ్ల నిర్మాణాలకు అనుమతి తప్పనిసరి

హొళగుంద: ఇళ్ల నిర్మాణాలకు అనుమతి తప్పనిసరి అని పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్లానింగ్ అప్రూవల్ లేకుండా కొందరు ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా



పార్టీలో చేరిన వారితో విరుపాక్షి



ఆస్పరి మండలం జొహరాపురంలో విరుపాక్షిని ఆశీర్వదిస్తున్న వృద్ధులు

- వైఎస్సార్‌సీపీ ఆలూరు అసెంబ్లీ అభ్యర్థి విరుపాక్షి

ఆలూరు: తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థి బుసినే విరుపాక్షిఅన్నారు. జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్, పార్టీ ఆలూరు నియోజకవర్గ పరిశీలకుడు సురేందర్‌రెడ్డితో కలిసి ఆయన శనివారం ఆస్పరి మండలం జొహరాపురం గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ ఐదేళ్లలో జగనన్న ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలను వివరించారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ ఇంటి వద్దకే జగనన్న సంక్షేమ ఫలాలను అందించారని, ఇవి కొనసాగాలంటే మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే అధికారంలోకి రావాలని వివరించారు. టీడీపీ నేతలను నమ్మి మోసపోవద్దని సూచించారు. ఫ్యాన్‌పై రెండు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బీవై రామయ్యను గెలిపించి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు. ఆయన వెంట ఆస్పరి ఎంపీపీ సుంకర ఉమాదేవి, జెడ్పీటీసీ దొరబాబు, మండల కన్వీనర్ పెద్దయ్య, జేసీఎస్ కన్వీనర్ బసవరాజు, సర్పంచు నెల్లూరప్ప, కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ రాఘవేంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు, రామాంజనేయులు, శ్రీరాములు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జొహరాపురం గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు సురేందర్‌రెడ్డి, విరుపాక్షిలను సన్మానించారు.



సురేందర్‌రెడ్డి, విరుపాక్షిలను సన్మానిస్తున్న జొహరాపురం గ్రామ ప్రజాప్రతినిధులు

వైఎస్సార్‌సీపీలో చేరిక

చిప్పగిరి: హాలహర్వి మండలం చింతకుంట గ్రామ టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన 54 కుటుంబాలు శనివారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారికి ఆలూరు అసెంబ్లీ అభ్యర్థి విరుపాక్షి చిప్పగిరిలోని తన స్వగృహంలో పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. సంక్షేమ పాలనకు ఆకర్శితులై పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో చిప్పగిరి మండల కన్వీనర్ మారయ్య, నాయకులు జనార్దన, నాగరాజు, తిప్పారెడ్డి, రంగన్న, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

నేడు విరుపాక్షి పర్యటన

హొళగుంద/హాలహర్వి: వైఎస్సార్‌సీపీ ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుసినే విరుపాక్షి ఆదివారం హొళగుంద, హాలహర్వి మండలాల్లో పర్యటించనున్నట్లు పార్టీ ఆయా మండలాల కన్వీనర్లు షఫివుల్లా, రామిరెడ్డి తెలిపారు. శనివారం వారు వేర్వేరుగా మాట్లాడుతూ మండల కేంద్రాల్లోని ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేసిన మంచిని వివరించి ఓటు వేయాలని కోరనున్నారన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని వారు కోరారు.

టీడీపీ కార్యకర్తల తోపులాట

ఆలూరు: దేవనకొండలో తమ్ముళ్లు తన్నుకున్నంత పని చేశారు. ముందు వరుసలో కూర్చునేందుకు ఒకరికొకరు తోసుకున్నారు. నాయకులు చెప్పినా పెడచెవిన పెట్టారు. ఈతతంగంలో ఓ వర్గం సమావేశం నుంచి బయటకెళ్లి పోయారు. దేవనకొండ మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలతో శనివారం ఆలూరు అసెంబ్లీ అభ్యర్థి వీరభద్రగౌడ్ సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. కార్యాలయంలో ఇబ్బందిగా ఉందని సమావేశాన్ని పత్తికొండ రోడ్డు సమీపంలోని లక్ష్మీకల్యాణ మండపానికి మార్చారు. అయితే ముందు వరుసలో తెర్నెకల్ రాఘవేంద్ర, కప్పట్రాళ్ల మల్లికార్జునతోపాటు మరో ఐదుగురు కూర్చున్నారు. ఇది జీర్ణించుకోలేని రాజు, తిమ్మప్ప, వెంకటేశ్వర్లు, తాయన్న మరో పది మంది కార్యకర్తలు.. నిన్నమొన్న పార్టీలో చేరిన వారిని ముందు వరస సీట్లలో కూర్చోబెట్టి అధిక ప్రాధాన్యత ఇవ్వడం ఏమిటని వీరభద్రగౌడును ప్రశ్నించారు. ఈక్రమంలో తామంటే తాము ముందు వరుసలో కూర్చుంటామని తోసుకున్నారు. కొందరు సమావేశాన్ని బహిష్కరించి బయటకు వెళ్లిపోతుండగా దేవనకొండ మాజీ ఎంపీపీ రామచంద్రనాయుడు నివరించేందుకు యత్నించినా ఫలితం లేకపోయింది.